క్లుప్తంగా

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



కోడూరు: సాలెంపాలెం శివారు వేణుగోపాలపురం ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులకు స్థానికుడు నల్లగుళ్ల దుర్గాప్రసాద్ నోట్‌బుక్స్, పలకలు, స్టేషనరీని అందించారు. దుర్గాప్రసాద్ తన తండ్రి వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం రూ.16 వేలు విలువ చేసే పుస్తకాలు, స్టేషనరీ సామగ్రిని పంపిణీ చేశారు. దాతను పాఠశాల ఉపాధ్యాయ బృందం సత్కరించింది. హెచ్‌ఎం దామోదరరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ చిలకలపూడి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్లు అందజేత



మచిలీపట్నంటౌన్: నగరంలోని 22వ డివిజన్ దేవునితోట యానాదుల కాలనీలో పేదలకు డాన్‌బాస్కో, నవజీవన్ విద్యా సంస్థ ఆధ్వర్యాన గురువారం పౌష్టికాహార కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వ్యతిరేక దినం పురస్కరించుకుని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి ముదిగొండ ఫణిధూర్జటి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ యానాదుల పిల్లలు చాలా మంది మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారని తల్లిదండ్రులు వారికి కౌన్సిలింగ్ ఇచ్చి చదువుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బొడ్డు నాగరాజు, డివిజన్ పెద్దలు కొలుసు సతీష్, బొమ్మనబోయిన నాగరాజు, నవజీవన్ సంస్థ ఎండీ వసంత పాల్గొన్నారు.

1న 'తపాలా బీమా' ఇంటర్వ్యూలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని ప్రధాన పార్కుకు ఎదురుగా ఉన్న తన కార్యాలయంలో తపాలా జీవిత బీమా ఏజెంట్ల ఎంపికకు జరిగే ఇంటర్వ్యూలకు అర్హత ఉన్న అభ్యర్థులు జూలై 1వ తేదీ హాజరుకావాలని మచిలీపట్నం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ బి. శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి ఇంటర్వ్యూ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 18 ఏళ్లు నిండిన అభ్యర్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లతో, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్‌కార్డు, పాన్ కార్డులతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఆకర్షణీయమైన కమీషన్ ఇస్తారని పేర్కొన్నారు.

విద్యార్థినికి అభినందన



మచిలీపట్నంటౌన్: కృష్ణా యూనివర్సిటీలో జరిగిన స్నాతకోత్సవంలో రెండు బంగారు పతకాలను సాధించిన నోబుల్ కళాశాల ఎంఎస్సీ విద్యార్థిని మన్నెం నవ్యను ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌జే ఎర్నెస్టు గురువారం అభినందించారు. కళాశాలలోని తన చాంబర్‌లో ఆయన మాట్లాడుతూ నవ్య యూనివర్సిటీ అత్యధిత సీజీపీఏ, బాలికల విభాగంలో అత్యధిక మార్కులు సాధించినందుకు గవర్నర్ అబ్దుల్‌నజీర్ నుంచి రెండు బంగారు పతకాలను, ప్రశంసా పత్రాలను అందుకోవటం సంతోషంగా ఉందన్నారు. ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు రోహిణి, పద్మిని అభినందించారు.

అందుబాటులో వరి విత్తనాలు

చల్లపల్లి: ఎంటీయూ–1061 వరి విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి కె.మురళీకృష్ణ గురువారం తెలిపారు. ఒక్కొక్కటీ 30 కిలోల బరువున్న విత్తనాల బస్తా రాయితీ పోగా రూ.1110 ఇచ్చి పొందవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుతం 48 క్వింటాళ్ల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

65 ఏళ్లు నిండిన వారికి ఇంటి వద్దే రేషన్

కోడూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు 65 ఏళ్లు నిండిన వృద్ధులకు జూలై నెల రేషన్ సరుకులను గురువారం నుంచి ఇంటి వద్దే డీలర్లు అందించారు. మండలంలోని 34 రేషన్ డిపోల పరిధిలో రేషన్ పంపిణీ ప్రక్రియను ప్రారంభించారు. బియ్యంతో పాటు పంచదారను డీలర్లు సంబంధిత వృద్ధుల ఇంటి వెళ్లి అందించి, వారి బయోమెట్రిక్‌ను తీసుకుంటున్నారు. ఐదు రోజుల పాటు ఇంటి వద్దే రేషన్ పంపిణీ ప్రక్రియ కొనసాగుతుందని రెవెన్యూ అధికారులు తెలిపారు.

గూడూరు: వయో వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దే రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నుంచి ప్రారంభించినట్లు తహసీల్దార్ డి.రాజ్యలక్ష్మి తెలిపారు. మండల పరిధిలో వయో వృద్ధులు, వికలాంగులకు సంబంధించి 2151 రేషన్ కార్డులు ఉన్నట్లు ఆమె వెల్లడించారు. నిత్యావసర వస్తువుల పంపిణీని పీడీఎస్ డీటీ మస్తాన్‌బి పరిశీలించారు.

యూపీహెచ్‌సీకి 'త్రీఫేజ్' వచ్చేనా..

- విద్యుత్ మంజూరులో తీవ్ర జాప్యం.. నిలిచిన రక్త పరీక్షలు
- ట్రాన్స్‌ఫార్మర్ బిగించి నెలలు గడుస్తున్నా కనెక్షన్ ఇవ్వలేని దుస్థితి



పెడన యూపీహెచ్‌సీ

పెడన: స్థానిక యూపీహెచ్‌సీకి త్రీఫేజ్ కరెంట్ సరఫరా ఇవ్వడంలో తాత్సారం జరుగుతోంది. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటరు)కు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా లేక రక్త పరీక్షలు అంతంత మాత్రంగానే చేస్తుండటంతో పాటు రూ.లక్షలాది విలువైన పరికరాలు నిరుపయోగంగా ఉన్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడమే కాకుండా వాటిని అమలు చేస్తూ ప్రతి కుటుంబానికి కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించడానికి చర్యలు తీసుకుంది.

అందులో భాగంగా పెడన పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని (అర్బన్ హెల్త్ సెంటరు) కోటి రూపాయలతో నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చింది. 2023 జూన్‌లో నాటి మంత్రి జోగి రమేష్ దీన్ని ప్రారంభించారు. అనంతరం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 14 రకాల రక్త పరీక్షలతో పాటు 78 రకాల మందులను అందుబాటులో ఉంచింది. వైద్య సిబ్బంది కొరతను అధిగమించి రోగులకు అందుబాటులో ఉంచేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ బిగించినా..

ప్రస్తుతం ఈ ఆస్పత్రిలో త్రీఫేజ్ విద్యుత్ సరఫరా లేదు. సింగిల్ ఫేజ్‌తో నడుస్తోంది. దీంతో అత్యాధునిక పరికరాలు సమకూరినా ఫీజులు కొట్టేసి నిరుపయోగంగా పడి ఉన్నాయి. త్రీఫేజ్ విద్యుత్ సరఫరాకు సంబంధిత శాఖాధికారులకు, పురపాలక సంఘ అధికారులకు ఆస్పత్రి వర్గాలు విన్నవించారు. ఇంతలో ప్రభుత్వం మారింది. ఎట్టకేలకు అదనంగా మరో రూ.2లక్షలు చెల్లించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారు. కనెక్షన్ మాత్రం ఇవ్వలేదు.

రెండు, మూడు రోజుల్లో సరఫరాకు చర్యలు

కలెక్టర్ చొరవతో రూ.3.18లక్షలు వైద్యారోగ్యశాఖ నిధులు కేటాయించింది. విద్యుత్‌శాఖకు చెల్లించడంతో వారు త్రీఫేజ్ సరఫరాకు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఆస్పత్రిలోకి సరఫరా ఇచ్చేందుకు సంబంధిత సామగ్రి కొనుగోలు చేశాం. రెండు, మూడు రోజుల్లో ఈ సామగ్రి రాగానే కనెక్షన్ ఇస్తాం. నాలుగైదు రోజుల్లో పూర్తిస్థాయిలో ఆస్పత్రికి విద్యుత్ సరఫరా అయ్యేలా చూస్తాం.

–కె.సీతారామాంజనేయులు, ఏఈఈ, పురపాలక సంఘం, పెడన

అందుబాటులోకి రాని రక్త పరీక్షలు



ఆస్పత్రిలో పరికరాలు సిబ్బంది అందుబాటులో ఉన్నాయి. అయినా పరీక్షలు చేయడానికి త్రీఫేజ్ విద్యుత్ సరఫరా లేకపోవడంతో సంబంధిత పరికరాలు నిరుపయోగంగా ఉంటున్నాయి. అత్యవసరం అయితే తప్ప వాటిని వినియోగించడం లేదు. ఇక్కడకు వచ్చేవారికి చిన్నపాటి రక్త పరీక్షలు తప్ప పెద్దవి చేయించుకోవాలంటే పెడన పీహెచ్‌సీకి సిఫార్సు చేస్తున్నారు. కొందరు నేరుగా యూపీహెచ్‌సీకి రాకుండా నేరుగా పెడన పీహెచ్‌సీకి వెళ్లిపోతున్నారు. ఎప్పుడు త్రీఫేజ్ విద్యుత్ వస్తుందా అని పురప్రజలు ఎదురుచూస్తున్నారు.

5న లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి

బంటుమిల్లి: బంటుమిల్లి జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో ఈ నెల 5వ తేదీన నిర్వహించే లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, న్యాయమూర్తి ఎం.భాస్కరరావు అన్నారు. గురువారం స్థానిక న్యాయవాదులు, పోలీసులతో కోర్టు ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కక్షిదారులు ఇబ్బంది పడకుండా కోర్టుల చుట్టూ తిరగకుండా రాజీ చేయదగిన కేసులను పరిశీలించి వాటిని లోక్‌అదాలత్‌లో పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. లోక్ అదాలత్ కారణంగా కక్షిదారులకు సమయం, సొమ్ము కలసి వస్తాయని ఆయన చెప్పారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు, న్యాయవాదులు వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.సోమశేఖర్, సీనియర్ న్యాయవాదులు కేవీ రాంబాబు, పీవీ వెంకటేశ్వరరావు, వి.కుటుంబశాస్త్రి, ఎ. రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో కోడూరు, మోపిదేవి విద్యార్థులకు సీట్లు



ఇమడాబత్తిన పల్లవి



అప్పల భవిత



బత్తుల ప్రవల్లిక



పామర్తి లౌక్య



బొమ్మిడి తేజ



జరుగు దోనాశ్రీ



బ్యూలా



నాగశివజ్యోతి



చైతన సౌమ్య

కోడూరు: పది ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఆరుగురు జెడ్పీ పాఠశాల విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. మండలంలోని స్వతంత్రపురం చామర్తి ప్రకాశరాయ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024–25 లో పదో తరగతి చదివిన ఇమడాబత్తిన పల్లవి (నూజివీడు ట్రిపుల్ ఐటీ), అప్పల భవిత (నూజివీడు), బత్తుల ప్రవల్లిక (నూజివీడు), పామర్తి లౌక్య (ఒంగోలు), బొమ్మిడి తేజ (ఒంగోలు), జరుగు డోనాశ్రీ (ఒంగోలు) ట్రిపుల్ ఐటీ సీట్లు దక్కించుకున్నారు. వీరందరూ ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో సీట్లు సాధించారని హెచ్‌ఎం మెండు ఉమామహేశ్వరరావు తెలిపారు. సీట్లు సాధించిన విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులను ఎంఈఓ టి.వి.ఎం.రామదాసు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

మోపిదేవి: స్థానిక జెడ్పీ పాఠశాల నుంచి ట్రిపుల్ ఐటీకి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయంతి తెలిపారు. దాసి బ్యూలా(581) నూజివీడు, పామర్తి నాగశివజ్యోతి(578) ఒంగోలు, కంచర్ల చేతన సౌమ్య(572) ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు తెలిపారు.

సమన్వయంతో ఆదర్శ గ్రామంగా మారుద్దాం

ప్రత్యేక అధికారి పద్మావతి



అధికారులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి పద్మావతి

పెడన: నందమూరును ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడానికి సమన్వయంతో పని చేద్దామని స్వచ్ఛ సర్వేక్షణ్ పెడన మండల ప్రత్యేక అధికారి, మచిలీపట్నం డీఎల్‌డీవో పద్మావతి అన్నారు. గురువారం ఉదయం ఆమె మండల పరిధిలోని నందమూరు గ్రామంలో పర్యటించారు. తొలుత కలెక్టర్ హాజరవుతారనే సమాచారంతో అధికారులు అక్కడికి చేరుకున్నారు. కలెక్టర్ పర్యటన రద్దు కావడంతో.. హాజరైన అధికారులతో పద్మావతి సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. తర్వాత గ్రామంలో పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించడంతో పాటు వ్యక్తిగత మరుగుదొడ్లు ఉన్నది లేని విషయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ కె. అనిల్‌కుమార్, ఎంపీడీవో ఎ.అరుణకుమారి, ఐసీడీఎస్ బంటుమిల్లి ప్రాజెక్టు అధికారిణి సముద్రవేణి, వెలుగు ఏపీఎం శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మొహరం ఏర్పాట్లు చేయండి



కమిషనర్‌కు మేయర్ ఆదేశాల పత్రాన్ని అందజేస్తున్న కార్పొరేటర్లు

మచిలీపట్నంటౌన్: నగరంలో ఈ నెల 27వ తేదీ నుంచి మొహరం దుఃఖ దినాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో కార్పొరేషన్ పరిధిలోని మసీదులు, పంజాల వద్ద చేపట్టాల్సిన పనులను త్వరితగతిన చేపట్టాలని మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ కమిషనర్ బాపిరాజును గురువారం ఆదేశించారు. నగరంలో పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. పంజాలు, మసీదుల వద్ద తాగునీటి ఇబ్బంది లేకుండా చూసి, లైటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. నిప్పులు గుండాలు ఏర్పాటు చేస్తారో ఆ ప్రాంతాల్లో మట్టి తోలాలన్నారు. ఈ మొదటి 11 రోజులే కాకుండా, రెండు నెలలు పాటు సాగే మొహరం దుఃఖదినాల సమయంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించి ముస్లింలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ జారీ చేసిన ఆదేశాల పత్రాలను కార్పొరేటర్లు మేకల సుబన్న, మీర్ అస్గర్ అలీ, తిరుమలశెట్టి ప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ అచ్చెబా, మాజీ కౌన్సిలర్ శీలం బాబ్జీ, వైఎస్సార్ సీపీ నగర నాయకులు బడే భాను, షేక్ మొహమ్మద్ సాహెబ్, మహ్మద్ రఫీ, నజఫ్ అలీ, కరార్ మూసావి గురువారం కమిషనర్‌కు ఆయన చాంబర్‌కు వెళ్లి అందజేశారు.

శివఫణిరామ్‌కు డాక్టరేట్



డాక్టరేట్‌ను స్వీకరిస్తున్న శివఫణిరామ్

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నానికి చెందిన జోశ్యుల శివఫణిరామ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో డాక్టరేట్ పొందారు. డీప్ లెర్నింగ్ విధానాలతో తెలుగు హస్తలేఖ అక్షరాల గుర్తింపు పద్ధతుల రూపకల్పన, అభివృద్ధి అంశంపై ఆయన పరిశోధనతో డాక్టరేట్ పూర్తి చేశారు. ఈ పరిశోధనలో భాగంగా తెలుగుభాషలో ఆప్టికల్ క్యారెక్టర్ రికగ్నైజేషన్ కోసం ఆప్టిమైజ్డ్ ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్‌వర్క్ అల్గోరిదమ్ రూపొందించి అభివృద్ధి చేశారు. 645 తెలుగు అక్షరాల సమగ్ర డేటాను రూపొందించినందుకు ఆయనకు పేటెంట్ వచ్చింది. ఇందులో భాగంగా పీహెచ్‌డీ డిగ్రీని బుధవారం కృష్ణ విశ్వవిద్యాలయంలో జరిగిన స్నాతకోత్సవ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రెక్టార్ బసవేశ్వరరావు చేతుల మీదుగా అందుకున్నారు.

నాణ్యమైన సిమెంట్‌తోనే భవనాల నిర్మాణం

భారతి సిమెంట్ అసిస్టెంట్ మేనేజర్ కళ్యాణచక్రవర్తి



బీమా బాండ్లను అందజేస్తున్న భారతి సిమెంట్ ప్రతినిధులు కళ్యాణ చక్రవర్తి, భవానీశంకర్

మచిలీపట్నంటౌన్: భవన నిర్మాణాలకు సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన నాణ్యమైన సిమెంట్‌ను ఎంపిక చేసుకోవాలని భారతి సిమెంట్ అసిస్టెంట్ మేనేజర్(మార్కెటింగ్) సీహెచ్ కళ్యాణచక్రవర్తి అన్నారు. నగరంలోని నవ్యశ్రీ ట్రేడర్స్ డీలర్ చింతా రవి సహకారంతో భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో కంపెనీ సీనియర్ టెక్నికల్ అధికారి ఎస్.భవానీశంకర్‌తో కలసి తాపీ మేస్త్రిలు, భవన నిర్మాణ కార్మికులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. బైపాస్ రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్లో జరిగిన సదస్సులో కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ భారతి సిమెంట్ అధునాతన పరిజ్ఞానం, నాణ్యమైన ముడి పదార్థాలతో తయారవుతోందన్నారు. శ్లాబ్ వేసిన వారం రోజుల తర్వాత కంపెనీ ప్రతినిధులు వచ్చి నాణ్యత పరీక్షలు చేసి భవన నిర్మాణ మేస్త్రిలు, యజమానులకు వివరిస్తారన్నారు. మేస్త్రీల సందేహాలను ఈ సందర్భంగా ఆయన నివృత్తి చేశారు. పలువురు మేస్త్రిలు, భవన నిర్మాణ కార్మికులకు రూ. లక్ష చొప్పున బీమా సదుపాయాన్ని కల్పించి బాండ్లను అందజేశారు.

ఉచితంగా టీబీ నిర్ధారణ పరీక్షలు

కృత్తివెన్ను: ప్రజలందరూ టీబీ రహిత భారత్‌కు సహకరించాలని కృత్తివెన్ను పీహెచ్‌సీ వైద్యుడు సాయిసందీప్ అన్నారు. గురువారం టీబీ వ్యాధి రహిత భారత్ అభియాన్ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా కృత్తివెన్నులో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. డాక్టర్ సందీప్ మాట్లాడుతూ 104 వాహనం క్యాంపు ఉన్న గ్రామంలో టీబీ నిర్ధారణ పరీక్షలు చేస్తామని ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు ప్రజలందరికీ తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. 14 రోజుల మించి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, ఆయాసం ఉన్న వాళ్లు, డయాబెటిస్ ఉన్నవారు, అతిగా పొగ తాగేవారు పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రాజేంద్రప్రసాద్, పద్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు వద్దు.. జీవితమే ముద్దు



చల్లపల్లి ప్రధాన సెంటర్లో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



నాగాయలంకలో ర్యాలీ



మచిలీపట్నంలో..

చల్లపల్లి: జీవితం ఎంతో విలువైనదని మాదకద్రవ్యాలు వద్దు.. జీవితమే ముద్దు అని ఎస్‌ఐ పి.ఎస్.వి.సుబ్రహ్మణ్యం అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగ నివారణ దినోత్సవం పురస్కరించుకుని పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు.

స్థానిక విజయ క్రాంతి కళాశాల, ఎస్‌ఆర్‌వైఎస్‌పీ, విజయ హైస్కూల్, జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు ఆయా పాఠశాలల నుంచి ప్రధాన రహదారుల వెంబడి ర్యాలీగా వచ్చి ప్రధాన సెంటరు వరకూ వచ్చారు. అందరూ కలిసి కూడలిలో మానహారం నిర్వహించారు. అందరితో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ఘంటసాల కృష్ణమోహన్, ఎమ్మీవో–2 పి.వెంకటేశ్వరరావు, డీటీ శ్రీలత, సర్పంచ్ పి.కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

బంటుమిల్లి: యువత మాదకద్రవ్యాల జోలికి పోకుండా భవిష్యత్‌ను అందంగా తీర్చిదిద్దుకోవాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగ నివారణ దినోత్సవం సందర్భంగా స్థానికంగా నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ వైజీవీ రమణ, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. జగన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కృత్తివెన్ను: యువత మాదకద్రవ్యాలు వంటి వ్యసనాలకులోనై జీవితాలను పాడుచేసుకోవద్దని మెరైన్ సీఐ వసంత్‌బాబు సూచించారు. గురువారం ఒర్లగొందితిప్ప, పోడు హైస్కూల్స్, కాలేజీలో మాదకద్రవ్యాల వాడకం, వాటితో కలిగే అనర్థాలను వివరించారు.

పెడన: విద్యాబుద్ధులు నేర్చుకునే వయస్సులో మాదకద్రవ్యాలు వినియోగించి జీవితాలను పాడు చేసుకోవద్దని ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పెడనలోని భట్టజ్ఞానకోటయ్య(బీజీకే)జెడ్పీ హైస్కూలు నుంచి పెడన ప్రధాన రహదారిలోని బంటుమిల్లి రోడ్డు సెంటరు వరకు ర్యాలీ నిర్వహించారు. ఇన్‌చార్జి తహసీల్దారుతో పాటు ఎంపీడీవో అరుణ కుమారి పలువురు అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు మానవహారంగా ఏర్పాటై మాదక ద్రవ్యాలు జోలికి వెళ్లమని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో–2 హరనాథ్, పెడన ఏఎస్‌ఐ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

నాగాయలంకలో..

నాగాయలంక: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం పురస్కరించుకుని నషా ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా నాగాయలంక పీఎస్, అవనిగడ్డ పోలీస్ సర్కిల్ ఆధ్వర్యాన గురువారం గ్రామంలోని ప్రధాన కూడలిలో భారీ మానవహారం నిర్మించారు. తహసీల్దార్ సీహెచ్‌వీ ఆంజనేయ ప్రసాద్, ఎస్.ఐ కలిదిండి రాజేష్ సందేశమిచ్చారు. తొలుత నాగాయలంక మలుపులోని సాయిబాబా మందిరం సెంటర్ నుంచి ర్యాలీ ఆరంభమై గ్రామంలోని ప్రధాన వీధుల్లో సాగింది. వెలుగు ఏపీఎం కడవకొల్లు ఏసుదాసు, ఎంఈఓ అన్నపరెడ్డి రామారావు, విద్యావేత్త ఆకుల వెంకటరత్నారావు తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ, జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అధికారులు, ఉద్యోగులు, పాఠకులు గురువారం మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వేములపల్లి రవికుమార్, డెప్యూటీ లైబ్రేరియన్ బీరం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవిలో..

మోపిదేవి: మోపిదేవి జెడ్పీపాఠశాల ఆవరణలో గురువారం డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక ఎస్‌ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ శ్రీవిద్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘంటసాల: అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ కార్యక్రమాన్ని ఘంటసాల ఎస్‌ఐ కె.ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. తహసీల్దార్ బి.విజయ ప్రసాద్, ఎంఈవో 2 ఎండీ మోమిన్, ఎంపీడీవో డి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణ ప్రతి పౌరుడి బాధ్యత



పాలకాయతిప్పలో అవగాహన కల్పిస్తున్న మెరైన్ సీఐ సురేష్‌రెడ్డి

కోడూరు: అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పోలీస్, మెరైన్ శాఖల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. పాలకాయతిప్ప మెరైన్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది పర్యవేక్షణలో ఉల్లిపాలెం, ఏటిమొగ్గ, సార్లగొంది పాఠశాలల్లో విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి సీఐ సురేష్‌రెడ్డి వివరించారు. సమాజంలో ప్రతి ఒకరూ బాధ్యతగా డ్రగ్స్‌ను అరికట్టేందుకు పోలీసులకు సహకరించాలన్నారు. మెరైన్ ఎస్‌ఐ పూర్ణమాధురి, ఎంఈఓ టి.వి.ఎం.రామదాసు, ఈఓపీఆర్డీ నాగరేవతి, డీటీ సౌజన్య కిరణ్మయి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

దాలిపర్రు ఎస్సీ కాలనీలో కూలిన తాటాకిల్లు

ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని కోరుతున్న ప్రసాద్ దంపతులు



దాలిపర్రులో వర్షానికి కూలిపోయిన ఇంటి ముందు తూము ప్రసాద్, బేబిషాలిని, పిల్లలు

దాలిపర్రు(ఘంటసాల): నిరుపేద కుటుంబానికి చెందిన తూము ప్రసాద్ ఇల్లు కూలిపోవడంతో ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఘంటసాల మండలం దాలిపర్రు గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన తూము ప్రసాద్, బేబీ షాలిని దంపతుల గృహం బుధవారం రాత్రి కురిసిన వర్షానికి, వీచిన గాలులకు కూలిపోయింది. ప్రసాద్, భార్య, ముగ్గురు పిల్లలతో ఆ ఇంటిలోనే నివసిస్తున్నారు. ఇల్లు కూలిన సమయంలో ఎలాంటి ప్రాణాపాయం జరగకపోవడంతో గ్రామస్థులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఉన్న ఇల్లు కూలిపోవడంతో ఏమి చేయాలో తెలియక ప్రసాద్ దంపతులు సతమతమవుతున్నారు. దాతలు, ప్రభుత్వం ఆదుకోవాలని ప్రసాద్ దంపతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వారాహి నవరాత్రులు ప్రారంభం

కె. కొత్తపాలెం(మోపిదేవి): కె. కొత్తపాలెంలో కృష్ణానది ఒడ్డున ఉన్న శ్రీ దుర్గా కోటేశ్వరస్వామి ఆలయంలో గురువారం వారాహి గుప్త నవరాత్రుల మహోత్సవాలు వైభవంగా ప్రారంభించారు. ఆలయ వ్యవస్థాపకులు రామిశెట్టి నాగరాణి, రామకృష్ణ దంపతులు ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి 7.30 గంటల నుంచి సామూహిక కుంకుమార్చనలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



చిలకలపూడి(మచిలీపట్నం): భోగరాజు పట్టాభి సీతారామయ్య గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా బి.స్వర్ణశ్రీ గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఆమె కలెక్టర్ డీకే బాలాజీని ఆయన చాంబరులో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.